

సోమశిలలో 62.209 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 62.209 టీఎంసీల నీరుంది. పైతట్టు ప్రాంతాల నుంచి 771 క్యూసెక్కులు వస్తుండగా, 98.347 మీటర్ల నీటిమట్టం నమోదయింది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.88,490
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,986
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,226
నవర (8 గ్రాములు)	రూ.65,808

గరిష్టం/కనిష్టం 33.3 /23.2

వాతావరణం

జిల్లాలో వాతావరణం బుధవారం సాధారణంగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 62 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వీఎస్‌యూ వైస్ చాన్సలర్‌గా అల్లం శ్రీనివాసరావు



అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ నూతన వైస్ చాన్సలర్‌గా అల్లం శ్రీనివాసరావు మంగళవారం నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్ పలు యూనివర్సిటీలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఢిల్లీ టెక్నాలాజికల్ యూనివర్సిటీలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు మూడేళ్ల పాటు వీఎస్‌యూ వైస్ చాన్సలర్‌గా కొనసాగుతారు.

ఆడిట్‌పై ప్రత్యేక దృష్టి

- ఎస్‌హెచ్‌జీలు ఆర్థిక ప్రగతి సాధించాలి
- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట): జిల్లా, మండల సమాఖ్యలు ఇంటర్నల్ ఆడిట్ విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఖర్చులు, ఆదాయాల విషయాల్లో లోటుపాట్లు ఉండకూడదని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఆదేశించారు. మంగళవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా సమాఖ్య సమావేశంలో పీడీ మాట్లాడారు. స్వయం సహాయక గ్రూపు మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ఉల్లాస్, సూర్యఘర్ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళలు కుటీర పరిశ్రమల ద్వారా చేస్తున్న ఉత్పత్తులను మార్కెటింగ్ కల్పించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఉత్పత్తులకు సంబంధించి ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ జరిగేలా విక్రయాలపై ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డీపీఎం కామాక్షి, రవికుమార్, సూరిబాబు, వెంకటేశ్వర్లు, జిల్లా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ వర్గీయుల దాడి



గాయపడిన పులి వెంకటప్రసాద్

వరికుంటపాడు: మండలంలోని తోటలచెరువుపల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పులి వెంకటప్రసాద్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు మౌలాలి, అతని కుమారుడు మరో ముగ్గురు కలిసి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. బాధితుడి కథనం మేరకు.. వెంకటప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి కుటుంబ విషయాలు మాట్లాడుకుంటుండగా దొడ్ల మౌలాలి మద్యం తాగి వచ్చి నానా దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. ఉదయం ప్రసాద్ బస్టాండ్ సెంటరుకు వెళ్లి తిరిగి వస్తుండగా మౌలాలి మరి కొంత మందితో కలిసి మరోసారి దాడి చేసి గాయపరిచారు. రాత్రి ఫిర్యాదు చేసేందుకు వరికుంటపాడు స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు తీసుకోలేదని, మౌలాలి ఇచ్చిన ఫిర్యాదు తీసుకున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై ఎస్‌ఐ రఘునాథ్‌ను వివరణ కోరగా ప్రసాద్ కుటుంబ సభ్యులు టీడీపీని విమర్శిస్తూ తనపై దాడి చేశారని మౌలాలి ఫిర్యాదు చేశాడన్నారు. మంగళవారం ఉదయం ప్రసాద్‌పై మౌలాలి మరికొంత మంది తనపై దాడి చేశారని ప్రసాద్ ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు ఇద్దరి ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సింహపురిలో కంపే కంపు



రామ్‌నగర్‌లోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్త



సాక్షాత్తు మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లూరు నగరం కంపుకొడుతోంది. 'నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడమే కాకుండా దోమల రహిత నగరంగా మార్చుతాం' అంటూ మంత్రి తరచూ చెబుతుంటారు. కానీ వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. నగరం చెత్తమయంగా తయారైంది. గతంలో ప్రతి రోజూ ఇంటింటి నుంచి చెత్త సేకరించగా, ప్రస్తుతం వారానికి రెండు రోజులే సేకరిస్తున్నారు. ఇళ్లల్లో పేరుకుపోయిన చెత్త నిల్వలతో దుర్గంధంతోపాటు కొత్త వ్యాధులు విజృంభిస్తున్నాయి.

- ఐవీఆర్ఎస్ సర్వేలో 57 శాతం అసంతృప్తి
- చెత్త సేకరణలో రాష్ట్రంలోనే అట్టడుగు స్థానం
- గతంలో రోజూ చెత్త సేకరణ.. ఇప్పుడు వారానికి రెండు రోజులే
- చెత్త బయట వేస్తే జరిమానా అంటూ హెచ్చరికలు
- ఇళ్లల్లో మగ్గిపోతున్న చెత్తతో దుర్గంధం
- మొత్తం 1,500 మంది పారిశుధ్య కార్మికులు
- దోమల దండయాత్రతో పెరిగిన వ్యాధులు
- మున్సిపల్‌శాఖ మంత్రి ఇలాకాలో దుర్భర పరిస్థితులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు నగరంలో చెత్త సేకరించడం లేదని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో తేటతెల్లమైంది. ఆ సర్వేలో దాదాపు 57 శాతం మంది ఇది చెత్త నగరంగా ఉందంటూ అభిప్రాయం వెల్లడించినట్లు సమాచారం. రాష్ట్రంలోనే నెల్లూరు కార్పొరేషన్ చెత్త సేకరణలో అట్టడుగు స్థానంలో ఉన్నట్లు స్పష్టమైంది. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న కార్పొరేషన్‌లో ఈ దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి.

గతంలో ప్రతి రోజూ.. ఇప్పుడు వారానికి రెండు రోజులే..

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 54 డివిజన్ల ఉండగా దాదాపు 10 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. 149.89 చ.కి.మీ. మేర విస్తరించిన నగరంలో 1.84 లక్షల గృహాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిత్యం ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తే.. ప్రస్తుతం వారానికి రెండు రోజులే చెత్త సేకరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. నగరంలో చెత్త సేకరణకు గత ప్రభుత్వం 143 మినీ వాహనాలను ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఆ వాహనాల్లో అత్యధికం మరమ్మతులకు గురై మూలన పడ్డాయి. వాటి స్థానంలో ట్రాక్టర్లను ఏర్పాటు చేసి వాటి ద్వారా చెత్త సేకరణ చేస్తున్నారు. దీంతో చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. చిన్న చిన్న వీధుల్లో ట్రాక్టర్లు వెళ్లే వీలు లేకపోవడంతో ఇళ్లలో చెత్తను రోడ్లపై పడేస్తున్నారు. దీంతో నగరంలోని అనేక ప్రాంతాల్లో వీధులన్నీ చెత్తా చెందారంతో దర్శనమిస్తుండడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది.

చెత్త వేస్తే జరిమానా అంటూ..

నగరపాలక సంస్థ అధికారులు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నామని ప్రచారం చేయడానికి గతంలో వీధి చివరలో ఉండే చెత్త డంపర్లను తొలగించేశారు. అదే స్థానంలో చెత్త వేస్తే జరిమానా విధిస్తామంటూ మరోవైపు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కొన్ని చోట్ల వినూత్న చర్యలంటూ చెత్త వేసే దగ్గర ముగ్గులు వేసి, పూల కుండీలు పెట్టి అక్కడ చెత్త వేయకుండా అడ్డుకుంటున్నారు. దీనికి తోడు వారానికి రెండు రోజులే ఇంటింటికి వచ్చి చెత్త సేకరిస్తుండడంతో ఇళ్లలో ప్రతి రోజు తయారయ్యే చెత్త నిల్వలతో ఇళ్లు కంపుకొడుతున్నాయి. దోమలు పెరగడంతోపాటు వ్యాధులు ప్రబలుతున్నాయి.

ప్రధాన వీధులకే పరిమితం

నగరంలో 54 డివిజన్లు ఉంటే.. పారిశుధ్య కార్మికులు ప్రధాన సెంటర్లు, కూడళ్లలోనే ఊడ్చుతూ కనిపిస్తారు. ఇళ్ల మధ్య వీధుల్లో ఎక్కడ వెతికినా కనిపించడం లేదు. ఉదాహరణకు మినీబైపాస్ మొత్తం మీద దాదాపు 3 డివిజన్లలో ఇరవై మంది కార్మికులు కూడా కనిపించని పరిస్థితి. మరి 15 వందల మంది కార్మికులు ఎక్కడ పనిచేస్తున్నారో అధికారులకే తెలియాలి. డ్రైనేజీలు చూస్తే దారుణంగా ఉన్నాయి. చెత్త పేరుకుపోయి నీరు రోడ్లపై పారుతోంది. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. చెత్త సేకరణ కోసం ప్రతి నెలా కార్పొరేషన్ దాదాపు రూ.7 కోట్ల మేర ఖర్చు చేస్తోంది. ఇంత ఖర్చు చేస్తున్నా.. ఆశించిన ఫలితాలు రావడం లేదు.

మంత్రి, ఎమ్మెల్యే ఆర్భాటపు ప్రచారాలు

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతోపాటు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతామంటూ ఆర్భాటంగా ప్రచారాలు చేస్తున్నారు. చెత్త పరిశీలన అంటూ ఫొటోలకు ఫోజులిచ్చి పోతున్నారే కానీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితిపై సమీక్షించడం కానీ, చర్యలు తీసుకోవడం కానీ చేయడం లేదని నగర ప్రజలు మండిపడుతున్నారు.

అధికార సేవలో పారిశుధ్య కార్మికులు

నగరాన్ని పరిశుభ్రతగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులే కీలకం. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 1,500 మంది కార్మికులు విధుల్లో ఉన్నారు. వీరిలో రెగ్యులర్ 262 మంది, ఔట్‌సోర్సింగ్ 1,237 మంది ఉన్నారు. రెగ్యులర్ మేస్త్రీలు 27 మంది, అవుట్ సోర్సింగ్ విధానంలో 323 మంది పనిచేస్తున్నారు. వీరిలో సగం మంది కార్పొరేషన్ ఉన్నతాధికారులు నుంచి కింది స్థాయి ఉద్యోగుల ఇళ్లలో పనిచేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పారిశుధ్య కార్మికులు విధులకు రాకున్నా జీతాలు ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇక మరమ్మతులకు గురైన మినీ చెత్త వాహనాల స్థానంలో ప్రత్యామ్నాయంగా కార్పొరేషన్ అధికారులు ట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. 89 ట్రాక్టర్లు, 17 కాంపాక్టర్లు, 54 మినీ వాహనాల ద్వారా చెత్త తరలిస్తున్నారు.



నగరంలోని పెద్దాస్పత్రి సమీపంలో ఓ వీధిలో పేరుకుపోయిన చెత్త కుప్ప

- నగరంలో డివిజన్ల సంఖ్య: 54
- జనాభా: 10 లక్షలు (అంచనా)
- నగర విస్తీర్ణం: 149.89 చ.కి.మీ.
- నివాసాల సంఖ్య: 1.86 లక్షలు (అంచనా)
- నిత్యం చెత్త సేకరణ: 300 టన్నులు
- చెత్త సేకరణ వాహనాలు: 160
- చెత్త సేకరణకు ప్రతి నెలా ఖర్చు: రూ.7 కోట్లు

విజృంభిస్తున్న వ్యాధులు

నెల్లూరు నగరాన్ని వ్యాధులు చుట్టుముట్టాయి. పేరుకుపోతున్న చెత్త నిల్వలతోపాటు అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. నగరంలో దాదాపు 45 శాతం మంది ప్రజలు వివిధ రకాల వ్యాధులతో అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూస్తే దాదాపు 75 శాతం నగర వాసులే కనిపిస్తున్నారు. ప్రస్తుతం గులియన్ బారె సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి భయపెడుతోంది. కొత్తగా ఈ వ్యాధి చుట్టేస్తుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. రూ.లక్షల్లో ఖర్చు చేసి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. ప్రస్తుతం పెద్దాస్పత్రిలో 20 మందికి పైగా జీబీఎస్ వ్యాధి లక్షణాలతో చికిత్స పొందుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా చేయిదాటిపోతోందో అర్థం చేసుకోవచ్చు.

ముక్కు మూసుకోవాల్సిందే



నగరంలో అపరిశుభ్రత కారణంగా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. ఎక్కడ చూసినా రోడ్లపై చెత్తాచెదారం కనిపిస్తోంది. రోడ్లపై రాకపోకలు సాగించాలంటే దుర్గంధం భరించలేక ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి తప్పడం లేదు. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో నగరం కంపు కొడుతోంది. గతంలో ప్రతి రోజు చెత్త తీసుకెళ్తే.. ఇప్పుడు వారంలో రెండు రోజులు కూడా వచ్చి తీసుకెళ్లడం లేదు. ఇళ్లలో చెత్త పెట్టుకుంటే కంపుకొడుతోంది. బయట వేద్దామంటూ జరిమానా అంటూ బెదిరిస్తున్నారు.

– సుబ్బారెడ్డి, నగర వాసి

అంటువ్యాధులు ప్రబలుతున్నాయి



ఏ వీధిలో చూసినా అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. చెత్తాచెదారం రోడ్డుపైనే పడేయడం, వాటిని తొలగించకపోవడంతో వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. అంటురోగాలు ప్రబలే అవకాశం ఉంది. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించి రోడ్లపై ఎక్కడా కూడా చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుంటే నగరం పరిశుభ్రంగా ఉంటుంది. వ్యాధులు కూడా ప్రబలకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. చెత్త తొలగింపులో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– ప్రసాద్‌రెడ్డి, నెల్లూరు నగర వాసి

రెడ్‌క్రాస్‌లో కలెక్టర్ తీరు ఆక్షేపణీయం

- అధికార పార్టీకి వంత పాడుతున్న కలెక్టర్
- తిరిగి చైర్మన్ ఎన్నికలు నిర్వహించాలి
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి డిమాండ్



నెల్లూరు(అర్బన్): సేవకు మారు పేరుగా ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాలక మండలి వ్యవహారంలో కలెక్టర్ ఆనంద్ తీరు ఆక్షేపణీయంగా ఉందని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి ఐదుగురు సభ్యులను తొలగించిన కలెక్టర్, అదే టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వ్యక్తిని రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఎన్నుకునేందుకు కలెక్టర్ ఎలా సహకరించారని నిలదీశారు. తిరిగి చైర్మన్ ఎన్నికను నిర్వహించాలని, కలెక్టర్ నిర్ణయాన్ని తప్పు పడుతూ కాకాణి మంగళవారం కలెక్టర్‌కు లేఖ రాశారు. రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యుల్లో 15 మందితో జనవరి 8న కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. అందులో ఏడుగురు రాజకీయ పార్టీలతో సంబంధాలు కలిగి ఉన్నారని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అయితే వారిలో 7 మంది కాకుండా కేవలం వైఎస్సార్‌సీపీకి చెందిన ఐదుగురు చైర్మన్‌గా ఉన్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితోపాటు సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, దామిశెట్టి సుధీర్, ఎంవీ సుబ్బారెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డిలను మాత్రమే టార్గెట్ చేసి గత నెల 11న నోటీసులు ఇచ్చిన కలెక్టర్, వారి నుంచి వివరణ తీసుకుని కూడా పదవుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. వైఎస్సార్‌సీపీ రాజకీయాల్లో ఉన్నప్పటికీ వీరు రెడ్‌క్రాస్‌లో ఎలాంటి రాజకీయ పక్షపాత ధోరణి అవలంభించలేదన్నారు. ఏ పార్టీకి చెందిన వారైన రెడ్‌క్రాస్‌లో పని చేయిచ్చన్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ ఎంపీ జాతీయ స్థాయిలో రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఉన్నారని, మన రాష్ట్రంలో సత్యసాయి జిల్లా బీజేపీ అధ్యక్షుడు అక్కడి రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఉన్నారన్నారు. రెడ్‌క్రాస్ ప్రాథమిక సభ్యత్వం కలిగిన వారిలో 80 శాతం మంది ఏదో ఒక రాజకీయ పార్టీతో సంబంధాలు ఉండే వారన్నారు. నెల్లూరు జిల్లాలో టీడీపీకి చెందిన వాకాటి విజయకుమార్‌రెడ్డి నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని మంత్రికి మద్దతుగా కరపత్రాలు ముద్రించి, అందులో తన నంబర్ కూడా ఇచ్చిన వ్యక్తి అని, అటు వంటి వ్యక్తిని చైర్మన్ చేశారన్నారు. కలెక్టర్ సభ్యత్వాలు రద్దు చేసిన ఐదుగురిని తిరిగి పాలక మండలి సభ్యులుగా కొనసాగించాలని హైకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ కలెక్టర్ పట్టించుకోలేదన్నారు. మిగతా 10 మంది సభ్యులతోనే ఎన్నిక నిర్వహించి నేరుగా టీడీపీ ప్రచారంలో పాల్గొన్న వాకాటి విజయకుమార్‌రెడ్డిని చైర్మన్‌గా, జనార్దన్‌రాజును వైస్ చైర్మన్‌గా ఎన్నుకునేందుకు సహకరించడం దారుణమన్నారు. విజయకుమార్‌రెడ్డి టీడీపీతో అంటకాగిన ఆధారాలను లేఖతో జతచేసి కలెక్టర్‌కు పంపించారు. కలెక్టర్ ఇప్పటికైనా 10 మంది సభ్యులతో ఎన్నికైన వాకాటి విజయకుమార్‌రెడ్డి చైర్మన్ పదవిని రద్దు చేయాలని కోరారు. కోర్టు తీర్పును అనుసరించి తిరిగి 15 మంది సభ్యులతో ఎన్నికలు నిర్వహించాలని, తద్వారా పక్షపాత ధోరణిని వదిలి పారదర్శకతను పాటించాలని కోరారు.

మధ్యాహ్న భోజన పథకంపై ఎంఈఓ విచారణ

- హెచ్ఎంకు మెమో, నిర్వాహకురాలికి నోటీసు

ఆత్మకూరు: పట్టణంలోని ఏసీఎస్ఆర్‌కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా లేదని ఫిర్యాదులు రావడం, పత్రికల్లో కథనాలు రావడంతో జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఎంఈఓ జ్యోతి మంగళవారం పాఠశాలలో తనిఖీలు నిర్వహించి, విచారణ చేపట్టారు. మధ్యాహ్నం భోజన సమయంలో ఎంఈఓ ఆహార పదార్థాలను రుచి చూశారు. విద్యార్థులను భోజన నాణ్యతపై నిర్భయంగా చెప్పాలని కోరడంతో కొందరు ఎంఈఓ దృష్టికి తీసుకొచ్చారు. హెచ్ఎం హజరత్తయ్య, ఉపాధ్యాయురాలు కె.సుజాతను ఎంఈఓ విచారించారు. పాఠశాల విద్యా కమిటీ సభ్యులను, కొందరు విద్యార్థుల తల్లులతోనూ ఎంఈఓ జ్యోతి విడివిడిగా మాట్లాడారు. పథకం నిర్వాహకురాలికి నోటీసు ఇచ్చినట్లు మరోసారి ఇలా జరగకుండా విద్యార్థులకు చక్కని భోజనం పెట్టాలని హెచ్చరించినట్లు తెలిపారు. హెచ్ఎంకు మెమో ఇచ్చినట్లు ఎంఈఓ జ్యోతి వివరించారు. ఈ మేరకు నివేదికను డీఈఓకు పంపనున్నట్లు ఆమె తెలిపారు.



వంద కేజీల గంజాయి స్వాధీనం



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం



కారు డోర్‌లో అమర్చిన గంజాయి

- ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు

కందుకూరు: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.17.50 లక్షల విలువైన 100 కేజీల గంజాయితోపాటు, కారును స్వాధీనం చేసుకున్నారు. కందుకూరులో డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం కొంతల్లి గ్రామానికి చెందిన ఇల్లపు నాగేశ్వరరావు, నాతవరం మండలం మన్నేపురట్ల గ్రామానికి చెందిన తాడి నాగసత్యన్నారాయణ, దుర్గారావు, ఆనందవేలు మరో ఇద్దరితో కలిసి గంజాయి అక్రమ రవాణా వ్యాపారం చేస్తున్నారు. వీరు ఒడిశా రాష్ట్రం నుంచి తమిళనాడుకు గంజాయిని రవాణా చేస్తుంటారు. ఈ మేరకు ఉలవపాడు పోలీసులకు సమాచారం రావడంతో సోమవారం ఉలవపాడు సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద వాహనాల తనిఖీని చేపట్టారు. క్యాబ్ వాహనాన్ని పోలీసులు ఆపి అందులో ఉన్న ఇల్లపు నాగేశ్వరరావు, తాడి నాగసత్యన్నారాయణను పోలీసులు ప్రశ్నించారు. ఈ క్రమంలో వీరితో పాటు ఉన్న దుర్గారావు, ఆనందవేలు అక్కడి నుంచి తప్పించుకు పారిపోయారు. అదుపులోకి తీసుకుని వారిని ప్రశ్నించడంతో గంజాయి రవాణా చేస్తున్నట్లు అంగీకరించారు. కారు డోర్లు, స్పీకర్ బాక్స్‌ల స్థానంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అమరికల్లో గంజాయిని ఉంచి ఎవరికీ అనుమానం రాకుండా తరలిస్తున్నట్లు చెప్పారు. కారు డోర్లలో దాచి ఉంచిన రూ.17.50 లక్షల విలువైన 95 ప్యాకెట్ల (100 కేజీల) గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో పాటు కారును, సెల్‌ఫోన్లు వంటివి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడులో ఉండే వ్యక్తులతో కుదిరిన ఒప్పందం మేరకు వీరు కావలి వద్దకు గంజాయిని చేర్చాల్సి ఉందని, ఆ తర్వాత అక్కడి నుంచి వేరే బ్యాచ్ గంజాయిని తమిళనాడు వరకు చేరుస్తారన్నారు. పారిపోయిన దుర్గారావు, ఆనందవేలును కూడా త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. కార్యక్రమంలో కందుకూరు సీఐ కే వెంకటేశ్వరరావు, ఉలవపాడు ఎస్సై కే అంకమ్మ, కానిస్టేబుల్‌లు ఎస్ శంకర్, పీ శ్రీనివాసరావు, కే బ్రహ్మయ్య, ఎస్‌కే రిజ్వాన్, జయశంకర్, ఎం మాలకొండయ్య, డీ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భూపరిహారం పెంచాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘాల నాయకులు

నెల్లూరు (అర్బన్): భారతమాల, సాగరమాల జాతీయ రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం పెంచి ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం కమిటీల నాయకులు కలెక్టర్‌ను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య మాట్లాడుతూ జిల్లాలోని ఏడు మండలాల్లో 108 కి.మీ. పరిధిలో సాగరమాల, 30 కి.మీ. జాతీయ రహదారులు నిర్మిస్తున్నారన్నారు. 35 గ్రామాల్లో 900 ఎకరాలు భూసేకరణ జరుగుతుందన్నారు. భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారం నామమాత్రంగా చెల్లిస్తున్నారన్నారు. గత కలెక్టర్ చెప్పిన ప్రకారం రైతులు ఆర్బిట్రేషన్ వేసినప్పటికీ ఇప్పటికీ విచారణ జరగలేదన్నారు. ఇకనైనా విచారణ జరిపి చట్ట ప్రకారం రైతులకు భూ పరిహారం పెంచాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలె వెంగయ్య మాట్లాడుతూ తోటపల్లిగూడూరు మండలం పేడూరులో బీపీసీఎల్ పైపు లైను నిర్మాణం కోసం కోత దశకు వస్తున్న పంటలను ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆ పనులు ఆపి పంట కోతలు పూర్తయ్యాక పైపులైను నిర్మాణం చేపట్టాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు, సంఘాల నాయకులు వెంకమరాజు, రాజా, పోతుగుంట కృష్ణయ్య, ఆదిశేషయ్య, వంశీకృష్ణ, లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించొద్దు

- రెవెన్యూ అధికారులకు హైకోర్టు మొట్టికాయలు
- నిరుపేద గిరిజనులు, పేద రైతులకు ఊరట కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు

సైదాపురం: నిరుపేద గిరిజనులు, పేదలు సాగు చేసుకునే పొలాలను నిబంధనలను మితిమీరి ఎలా స్వాధీనం చేసుకుంటారని, నిబంధనలు అతిక్రమించొద్దంటూ హైకోర్టు రెవెన్యూ అధికారులకు మొట్టికాయలు వేస్తూనే.. ఈ విషయంలో నిబంధనలు ప్రకారం నడుచుకోవాలంటూ ఈ నెల 14న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. సైదాపురంలోని 793 ఏ సర్వే నంబర్‌లో ఉన్న 114 ఎకరాల భూమికి మైనింగ్ లీజు ఉండేది. గడిచిన కొన్నేళ్లగా లీజు గడువు కూడా ముగిసింది. ఈ క్రమంలోనే సమీపంలోని కమ్మవారిపల్లికి చెందిన ఐదు గిరిజన కుటుంబాలతో పాటు మరో 10 మంది నిరుపేదలు ఎకరా నుంచి రెండెకరాల వంతున ఆక్రమించుకుని నిమ్మ తోటలను సాగు చేసుకుంటున్నారు. అయితే సాగులో ఉన్న ఆ భూములను స్వాధీనం చేసేందుకు అధికారులు ప్రయత్నించడంతో గిరిజనులతోపాటు పేదలు హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనలకు అనుగుణంగా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలే తప్ప ఇప్పటికిప్పుడు చర్యలు చేపట్ట వద్దంటూ హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది.

పేదలం మాకు న్యాయం చేయండి

తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిచ్చి అందుకోవాలని ప్రభుత్వ భూముల్లో నిమ్మ సాగు చేసుకుంటున్న రైతులు అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై అధికారులకు కూడా వినతిపత్రంతో పాటు కోర్టు ఆర్డర్‌ను అందజేయనున్నట్లు బాధితులు పేర్కొన్నారు. తాము కష్టపడి రెండెకరాల వంతున ఆక్రమించుకుని, అప్పులు తెచ్చి నిమ్మతోటలపై పెట్టుబడులు పెట్టాం. తీరా పంట చేతికొచ్చే సరికి ఆ భూములు మైనింగ్ లీజులు ఇచ్చే ప్రయత్నం చేయడం సరికాదు.



గిరిజనులు సాగు చేసుకుంటున్న నిమ్మ తోటలు, చెట్లు ఇవే

క్లుప్తంగా

21న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 21వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సీఈఓ విద్యారమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక ప్రణాళిక, గృహ నిర్మాణ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం తదితర వాటిపై సమీక్షలు ఉంటాయన్నారు. జెడ్పీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సమావేశాలు జరుగుతాయని తెలియజేశారు.

1.71 లక్షల మంది రైతులకు యూనిక్ ఐడీలు

- జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి



మాట్లాడుతున్న సత్యవాణి

మనుబోలు: జిల్లాలోని 1,71,500 మంది రైతులకు యూనిక్ ఐడీ (విశిష్ట సంఖ్య) నమోదు చేయడమే లక్ష్యమని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. మండలంలోని జట్ల కొండూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వరి పొలాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి రైతు యూనిక్ ఐడీ కలిగి ఉండాలన్నారు. దీని ద్వారానే ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నెలాఖరులోపు యూనిక్ ఐడీని నమోదు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలో 297 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే రైతులందరూ ఈకేవైసీ, ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ శివనాయక్, నర్సోజీరావు, ఏఓ జహీర్, ఏఏఓ కళారాణి తదితరులు పాల్గొన్నారు.


మద్యం మత్తులో రౌడీషీటర్ వీరంగం

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో ఓ రౌడీషీటర్ తన స్నేహితుడితో కలిసి వీరంగం సృష్టించిన ఘటన నెల్లూరు పొదలకూరురోడ్డులోని ఓ వైన్‌షాపు వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. నగరానికి చెందిన ఓ రౌడీషీటర్ తన స్నేహితుడితో కలిసి మంగళవారం వైన్ షాపునకు వెళ్లారు. పక్కనే ఉన్న కూల్‌డ్రింక్ షాపులో పూటుగా మద్యం తాగారు. సాయంత్రం బయటకు వచ్చిన వారు మద్యం మత్తులో వీరంగం చేశారు. ఓ యువకుడిపై దాడి చేశారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న దర్గామిట్ట ఎస్సై రమేష్‌బాబు తన సిబ్బందితో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన మందుబాబులు పరారయ్యారు. దీంతో వారికోసం గాలిస్తున్నారు.

న్యాయసేవ సహాయకుల పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్): జిల్లా న్యాయసేవాధికార సంస్థ నెల్లూరు, మండల న్యాయసేవాధికార సంస్థ కమిటీలైన గూడూరు, కోవూరు, కావలి, ఆత్మకూరు, వెంకటగిరి, కోట, సూళ్లూరుపేట, నాయుడుపేట, ఉదయగిరిల్లో పారా లీగల్ వలంటీర్లు (న్యాయసేవ సహాయకులు)గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లుగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండి ఇంటర్ ఆపైన విద్యార్హతలు గల వారు రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తులు పంపాలన్నారు. ఒక సంవత్సర కాలపరిమితితో భర్తీ అయ్యే ఈ పోస్టులకు ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారు నిర్ధారించిన గౌరవ వేతనాన్ని అందిస్తామన్నారు. దరఖాస్తులను చైర్మన్ కం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, న్యాయసేవా సదన్, డిస్ట్రిక్ట్ కోర్టు కాంపౌండ్, నెల్లూరు చిరునామాకు ఈనెల 25వ తేదీలోగా పంపాలని కోరారు. రిజిస్టర్ పోస్టుపై అప్లికేషన్ ఫర్ ఎంపానెల్‌మెంట్ ఆఫ్ పారా లీగల్ వలంటీర్స్ అని రాయాలన్నారు. ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించాలని కోరారు. ప్రజలకు చట్టపరంగా న్యాయసహాయం అందించేందుకు పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీ సేవకులు, లా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

గరుడ వాహనంపై నృసింహుడి ఊరేగింపు



రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వాతి నక్షత్రం శ్రీవారి జన్మ నక్షత్రం కావడంతో మంగళవారం మూలమూర్తికి చందనంతో అలంకారం చేసినట్లుగా అర్చకులు తెలిపారు. సాయంత్రం బంగారు గరుడ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి మేళతాళాల నడుమ కోన మాడవీధుల్లో ఊరేగించారు.

అధికారంలో ఉన్నాం.. వాడేస్తాం

మోడల్ స్కూల్ మైదానంపై 'నారాయణ' కన్ను

- స్టేజీ నిర్మించిన ఆ విద్యాసంస్థల యాజమాన్యం
- ప్రత్యేకంగా దారి ఏర్పాటు చేసిన వైనం
- అక్కడ క్రీడా కోర్టులు ఏర్పాటు చేస్తామని మభ్యపెట్టే యత్నం



మోడల్ స్కూల్ గ్రౌండ్

అధికారాన్ని అడ్డం పెట్టుకుని తన విద్యాసంస్థలకు మేలు చేసే విధంగా మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పదిమందికి ఆదర్శంగా ఉండాల్సిన ఆయన ప్రభుత్వ పాఠశాల మైదానాన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు వాడుకునేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది.



గ్రౌండ్‌లో నిర్మించిన వేదిక

నెల్లూరు(టౌన్): నెల్లూరు నగరంలోని సంతపేటలో ప్రభుత్వ మోడల్ స్కూల్ (గుంతబడి) ఉంది. దీనికి ఎన్నో సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ పాఠశాలకు అనుగుణంగా బీఈడీ కళాశాల ఉంది. మోడల్ స్కూల్లో 567 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌గా ఉన్నతీకరించింది. ఇంటర్‌కు సంబంధించి 34 మంది విద్యార్థిలున్నారు. ఈ పాఠశాలకు విశాలమైన భవనం ఉంది. దీనికి వెనుక వైపు 2.5 నుంచి 3 ఎకరాల వరకు మైదానం ఉంది. విద్యార్థులు ఆడుకునేందుకు అనువుగా ఉండేది.

పూర్తి స్థాయిలో..

నగరంలోని ప్రభుత్వ పాఠశాలల భవనాలు, మైదానాలను సుందరీకరణ చేపట్టనున్నట్లు 10 రోజులుగా మంత్రి నారాయణ ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నారు. వారం వ్యవధిలోనే మోడల్ పాఠశాలకు అధికారులను వెంటబెట్టుకుని రెండుసార్లు వెళ్లారు. పాఠశాల మైదానంలో క్రీడలకు సంబంధించి పలు కోర్టులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా ధనంతో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ ట్రాక్, బాస్కెట్ బాల్, నెట్ క్రికెట్, జిమ్ తదితర కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి మైదానంలో చెట్లు తొలగించి చదును చేశారు. అయితే ఈ పనులన్నీ హడావుడిగా చేస్తోంది ప్రజల కోసం కాదని, నారాయణ స్కూల్ విద్యార్థుల కోసమే నని అనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఆ మైదానాన్ని ఆ యాజమాన్యం వాడుకుంటున్న నేపథ్యం కూడా ఉంది. కూటమి సర్కారు వచ్చాక ప్రభుత్వ స్థలాలను టీడీపీకి చెందిన పలువురు నాయకులు కబ్జా చేసిన సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వ పాఠశాల మైదానానికి దారి, స్టేజీ ఏర్పాటు చేయడం చూస్తే భవిష్యత్‌లో ఈ స్థలం కూడా కబ్జాకు గురయ్యే అవకాశాలున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఆక్రమణ దిశగా..

మోడల్ స్కూల్‌కు సంబంధించిన మైదానాన్ని ఆనుకుని నారాయణ స్కూల్ ఉంది. ఇక్కడ చదివే పిల్లలు ఆడుకునేందుకు స్థలం లేదు. ఈ నేపథ్యంలో సదరు యాజమాన్యం కన్ను మోడల్ స్కూల్ మైదానంపై పడింది. నారాయణ పాఠశాల వెనుక వైపు నుంచి మైదానంలోకి వెళ్లేందుకు సొంతంగా దారిని ఏర్పాటు చేశారు. మెట్లు కూడా నిర్మించారు. మోడల్ స్కూల్ పిల్లలు మైదానంలోకి వెళ్లేందుకు గతంలోనే దారి ఉంది. దీనిని పట్టించుకోని నారాయణ యాజమాన్యం వారి పిల్లల కోసం దారి ఏర్పాటు చేయడం, స్టేజీ చర్చనీయాంశంగా మారింది. వారి స్కూల్‌కు సంబంధించిన పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు అన్నీ ఇక్కడే నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. మైదానం లేకుండానే నారాయణ యాజమాన్యం పాఠశాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ స్కూల్‌కు స్థలాన్ని యథేచ్ఛగా వినియోగించడంపై విమర్శలు వస్తున్నాయి.

దారి, స్టేజీ విషయం తెలియదు

మోడల్ స్కూల్ మైదానానికి సంబంధించి నారాయణ స్కూల్ వెనుక ఉన్న దారి, స్టేజీ విషయం నాకు తెలియదు. నేను హెచ్‌ఎంగా వచ్చి ఏడాదిన్నరైంది. అయితే ఈ మైదానంలో పలు రకాల క్రీడా కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించి కొలతలు వేయడం జరిగింది. – వెంకటేశ్వర్లు, హెడ్‌మాస్టర్, మోడల్ హైస్కూల్ ప్లస్

ఆయుర్వేద మందుల పేరిట మోసం

- నిందితులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఆయుర్వేద మందులు వాడితే చెవుడు పోతుందని ఓ వృద్ధుడిని నమ్మించి రూ.లక్షలు కాజేసిన నిందితులపై నెల్లూరు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. గుప్తా పార్క్ సెంటర్‌కు చెందిన ఓ వృద్ధుడు స్థానికంగా చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆయనకు చెవుడు ఉంది. ఈక్రమంలో కృష్ణ అనే వ్యక్తి పరిచయమై తన తండ్రికి సైతం చెవుడు ఉందన్నాడు. ఓ ఆయుర్వేద కంపెనీకి చెందిన మందులు వాడటం ద్వారా చెవుడు పోయిందని నమ్మబలికాడు. అయితే ఆ మందులు చాలా ఖరీదైనవని కొంతకాలం క్రమం తప్పకుండా వాడాలని చెప్పాడు. దీంతో వృద్ధుడు అతడికి రూ.95 వేలను ఫోన్‌పే ద్వారా వేశాడు. ఈక్రమంలోనే విజయ్ అనే వ్యక్తిని తన అన్న అంటూ కృష్ణ వృద్ధుడికి పరిచయం చేశాడు. విజయ్ కొన్ని ఆకులు, లేహ్యం ఇచ్చి వాటిని రోజూ వాడాలన్నాడు. వృద్ధుడు కొద్ది రోజులు వాడగా సైడ్ ఎఫెక్ట్స్ రావడంతో వారిని ప్రశ్నించాడు. ఇంకొన్ని మందులు వాడితే తగ్గిపోతుందని చెప్పారు. ఇటీవల వృద్ధుడిని శోధన్‌నగర్‌లోని ఓ ఆయుర్వేద దుకాణం వద్దకు తీసుకెళ్లి రూ.4.25 లక్షలు తీసుకుని కొన్ని మందులను ఇప్పించారు. వాటిని ఎలా వినియోగించాలో ఇంటి వద్దకు వచ్చి చెబుతామని కృష్ణ, విజయ్‌లు వెళ్లిపోయారు. ఇంటికెళ్లిన వృద్ధుడు వారికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. షాపు వద్దకు వెళ్లి చూడగా మూసివేసి ఉండటంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సంతపేట పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేశారు.

మన్నేరులో ఇసుక దొంగలు

జోరుగా తవ్వకాలు

- దారకానిపాడు సమీపంలో డంపింగ్
- కూటమి నాయకుల్లో విభేదాలు



మన్నేరులో ఇసుక డంపింగ్

గుడ్లూరు: కూటమి ప్రభుత్వంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రకృతి వనరులను దోచుకుంటున్నారు. మండలంలోని దారకానిపాడు సమీపంలో ఉన్న మన్నేరులో టీడీపీ నాయకులు జేసీబీల ద్వారా ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. దారకానిపాడు సమీపంలో డంపింగ్ చేసి అర్ధరాత్రి వేళల్లో మండలంలోని చుట్టుపక్కల ఉన్న వారికి, కందుకూరు పట్టణానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తంతు ఆరునెలల నుంచి సాగుతోంది. కాగా టీడీపీలోని రెండు వర్గాలు ఇసుక తరలింపుపై ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ఓ వర్గం ఇటీవల కందుకూరు సబ్ కలెక్టర్‌కు తిరుమణిశ్రీ పూజకు ఈ దోపిడీ గురించి అర్జీ ఇచ్చింది.

నాలుగు ట్రాక్టర్లలో..

సోమవారం సాయంత్రం నాలుగు ట్రాక్టర్లలో ఇసుక నింపి కందుకూరు ప్రాంతానికి తరలించారు. ఈ విషయమై గ్రామస్తులు సబ్ కలెక్టర్‌కు సమాచారమిచ్చారు. దీంతో ఆమె దారకానిపాడు గ్రామానికి చేరుకున్నారు. ఇంతలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నాయకుడికి కొందరు సమాచారం అందించారు. వాహనాల లైట్ల ఫోకస్ చూసి జేసీబీ డ్రైవర్ అప్రమత్తమై జామాయిల్ తోటలోకి తీసుకెళ్లినట్లు సమాచారం. మన్నేరు నుంచి దారకానిపాడు గ్రామంలోకి రావడానికి ప్రత్యామ్నాయ మార్గం లేక స్కూటీ, ట్రాక్టర్, కారు యజమానులు సబ్ కలెక్టర్ వాహనాన్ని చూసి పరారయ్యారు. ఆమె స్థానిక వీఆర్వోకి మూడు వాహనాలను స్వాధీనపరిచి పోలీసులకు ఫిర్యాదు చేయమని ఆదేశించారు.



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

కేసు నమోదు

మన్నేరు నుంచి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు గుడ్లూరు ఎస్సై పి.వెంకట్రావు మంగళవారం తెలిపారు. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు మూడు వాహనాలపై కేసు నమోదు చేశామన్నారు.

భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సుజాత, చిత్రంలో అధికారులు

- డీఎంహెచ్‌ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): భ్రూణ హత్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ సుజాత తెలిపారు. గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై నెల్లూరు సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయి కమిటీ సభ్యులకు, స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలకు, మెడికల్ అసోసియేషన్ల నేతలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లపై దాడులను విస్తృతం చేస్తామన్నారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ చేసినట్టు తెలిస్తే ఆ సెంటర్లను సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్కానింగ్ చేసేవారు ప్రతి గర్భిణి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్లో నమోదు చేయాలన్నారు. అల్ట్రా సౌండ్, ఎంఆర్‌ఐ, సీటీస్కాన్, ఎకో, బీ-స్కాన్ నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డీఐఓ డా.ఉమామహేశ్వరి, కమిటీ సభ్యులు పీడియాట్రిషియన్ డా.సర్దార్ సుల్తానా, గైనకాలజిస్ట్ డా సీహెచ్ కిరణ్, డివిజనల్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డా.దయాకర్, డీఎస్పీ రామారావు, డా.బ్రిజిత, డా.శోభారాణి, డెమో అధికారి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

విలీన ప్రక్రియను ఆపాలంటూ..



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని పెద్దచెరుకూరులో ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను 1.2 కిమీటర్ల దూరంలో ఉండే మరో స్కూల్లో విలీనం చేసే ప్రక్రియను విరమించుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మంగళవారం స్కూల్ ఎదుట పిల్లలతో కలిసి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎస్టీ వర్గానికి చెందిన వారిమని, ఎక్కువ మంది మిమి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. విలీనం చేస్తే ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు బడి మానేస్తారని తెలిపారు. బేసిక్ ప్రైమరీ స్కూల్‌గానే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బి.శారద, వెంకటరమణమ్మ, పద్మప్రియ, హర్షిణి, చెంచులక్ష్మి పాల్గొన్నారు.

సిమెంట్ బ్రిక్స్ తరలిస్తుండగా అడ్డగింత




ట్రాక్టర్‌లో సిమెంట్ బ్రిక్స్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పక్కా గృహం నిర్మాణానికి సంబంధించిన సిమెంట్ బ్రిక్స్‌ను ఓ కాంట్రాక్టర్ తరలిస్తుండగా ప్రజలు అడ్డుకున్న ఘటన మంగళవారం జరిగింది. నెల్లూరు 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీలో గత ప్రభుత్వంలో లేఅవుట్ వేశారు. కొన్ని ఇళ్లు నిర్మించగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. ఈ క్రమంలో నరాల సుబ్బారెడ్డి అనే కాంట్రాక్టర్ సగం నిర్మించిన ఓ ఇంటిని పగులకొట్టి సిమెంట్ బ్రిక్స్‌ను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ విషయమై హౌసింగ్ ఈఈ మోహన్‌రావు మాట్లాడుతూ సదరు కాంట్రాక్టర్ సిమెంట్ బ్రిక్స్‌ను అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్నట్టు స్థానికులు తనకు సమాచారం ఇచ్చారన్నారు. అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించానన్నారు.

విన్నవించినా.. స్పందన లేదు

- అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడాలి
- సంబంధిత అసోసియేషన్, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన
- టీడీపీ నాయకుల ఓవరాక్షన్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

వరికుంటపాడు: అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదని సీపీఐ, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, ఆ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావులు మండలంలోని కనియంపాడు సమీపంలో అక్రమంగా నరికివేసిన జామాయిల్ తోటలను మంగళవారం పరిశీలించారు. కొంతసేపు ఆందోళన చేపట్టారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ల వద్దకు చేరుకుని అక్కడ బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వరికుంటపాడు మండలంలో భాస్కరాపురం, కనియంపాడు గ్రామాల సమీపంలో 150 ఎకరాల్లో జామాయిల్ సాగు ఉందన్నారు. ఆ చెట్లను సుమారు రెండు నెలల నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమార్కులు నరికివేసి రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ విషయాన్ని ఇటీవల తహసీల్దార్‌కు విన్నవించామన్నారు. అయినా స్పందన లేదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్ కర్రను తరలింపు వెనుక బడా నాయకుల హస్తం ఉందని తెలుస్తోందన్నారు. తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా భయపడే ప్రసక్తే లేదని, ఆందోళనలను కొనసాగిస్తామన్నారు. ఈ అంశాన్ని సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక రక్షణ కల్పించాలని కోరుతామన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లగా అక్కడ అధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

తీవ్ర వాగ్వాదం

నిరసన కార్యక్రమాల అనంతరం నేతలు తిరుగు ప్రయాణమయ్యారు. వరికుంటపాడు సమీపంలో జామాయిల్ లోడుతో ట్రాక్టర్ వెళ్తుండగా అడ్డుకుని ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	100
లేయర్ (లైవ్)	75
బ్రాయిలర్ చికెన్	184
బ్రాయిలర్ స్కిన్‌లెస్	206
లేయర్ చికెన్	127

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	రూ.47
సన్నవి	రూ.30
పండ్లు	రూ.10